# భార్య మరణానికి కారణమైన భర్తకు పదేళ్లు జైలు శిక్ష

**సిద్దిపేట రూరల్, మే 29, ప్రభాతవార్త :**
భార్య మరణానికి కారణమైన భర్తకు 10 యేండ్లు కఠిన కారాగార జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమాన విధిస్తు సోమవారం న్యాయమూర్తి టి.రఘురాం తీర్పునిచ్చినట్లు టూ టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన శంకర్ కూతురు వాగ్మారేరాదను నాందేడ్‌కు చెందిన వాఘమరే మహదేవ్ 2013లో ఇచ్చి పెళ్లి చేసినట్లు తెలిపారు. బతుకు దేరువు కోసం సిద్దిపేటకు వచ్చి టూ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీలో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో 2018 అగస్టులో వాఘుమరే మహదేవ్ బాగా మద్యం సేవించి భార్యతో గొడవపడి ఇష్టం వచ్చినట్లు కొట్టినట్లు తెలిపారు. అ దెబ్బల బాధ భరించలేక రాధ మరణించిందని తెలిపారు. న్యాయమూర్తి రఘురాం ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరస్తుని నేరం రుజువుకావడంతో 10 యేండ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తు తీర్పునిచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత కేసు పరిశోధన చేసిన ప్రాసిక్యూషన్ సమయంలో సపోర్ట్ చేసిన పోలీసు అధికారులను సిబ్బందిని అభినందించారు.




# జూన్ 11న కలెక్టరేట్‌లో కవి సమ్మేళనం : కలెక్టర్

**మెదక్ అర్బన్, మే29 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 11న కలెక్టరేట్ నందు కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ సాధించిన ప్రగతి అనే అంశాలపై తెలుగు, ఉర్దూ భాషల్లో కవితలను రాసి హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీలను జూన్ 7న సాయంత్రం 5 గంటలలోపు కలెక్టరేట్‌లోని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఎంపిక కమిటీ పరశీలించి ఎంపిక చేసిన వాటికి జూన్ 11న నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనుటకు అహ్వానిస్తామని ఆయన తెలిపారు. అందులో ఉత్తమమైన మూడింటిని ఎంపిక చేసి నగదు పురస్కారంతో సత్కరిస్తామని అన్నారు. జిల్లాలో ఆసక్తి గల కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ స్వీయ రచనలను పంపవలసిందిగా సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి 8328599157 మొబైల్ నెంబర్‌కు సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.


ఇంట్లో సమాన్లను చింతర వందరగా పారేసిన దృశ్యం

## డ్రీమ్ వ్యాలీలో దొంగల బీభత్సం

### ఇంట్లో చోరీ 15 తులాల బంగారం 20వేల నగదు అపహరణ

**జహీరాబాద్, మే 29, ప్రభాతవార్త:** పట్టణ శివారులోని డ్రీమ్ వ్యాలీలో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి ఇంట్లోని బీరువాను పగలగొట్టి బంగారం, వెండి, నగదును తస్కరించారు. ఇందుకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం... పట్టణంలోఇ మహీంద్రా కంపెనీలో పని చేసే పాండే రఘు ప్రసాద్ డ్రీమ్ వ్యాలీలో నూతనంగా ఇంటిని నిర్మించుకుని కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటు న్నాడు. ఆదివారం పాండేరఘు ప్రసాద్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి హైద్రాబాద్‌కు వెళ్లిపోయారు. పాండే రఘు ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి హైద్రాబాద్ వెళ్లినట్లు తెలుసుకున్న దుండగులు సోమవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగలకొట్టాఇ ఇంట్లోకి ప్రవేశించి యదేశ్చగా దొంగతనం చేశారు. ఇంట్లోని బీరువాను పగలకొట్టి అందులోని 15 తులాల బంగారం, వెండి, 20వేల నగదును దోచుకెళ్లిపోయారు. సోమవారం ఉదయం రఘు ప్రసాద్ కుమారుడు ఇంటికి చేరుకోగా ఇంటి తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు తెలుసుకున్నాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## టికెట్ ఎవరికిచ్చినా గెలుపు కోసం కృషి చేస్తా

**- మెదక్ మాజీ ఎమ్మెల్యే పి.శశిధర్‌రెడ్డి**

**పాపన్నపేట, మే 29, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మెదక్ అసెంబ్లీ టికెట్ ఎవరికిచ్చినా వారి విజయం కోసం కృషి చేస్తామని మెదక్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్లోళ్ళ శశిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం అనాది నుండి కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. ఈ క్రమంలో పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు గ్రామ గ్రామాన, వీధి వీధిన తిరిగి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతు ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టర్‌ని తిరిగి తెరిపిస్తామన్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆ విషయం మరిచిపోయిందన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

### ధర్నాకు మద్దతు తెలిపిన వాల్దాస్ మల్లేష్‌గౌడ్


రైతులుచేస్తున్న ధర్నాకు మద్దతుపలికిన వాల్దాస్ మల్లేష్‌గౌడ్, హెచ్. వెంకటరమణారావు తదితరులు

**నర్సాపూర్, మే 29.ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు అమ్ముకోవడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పడరాని పాట్లు పడుతున్నామని, ఇందుకోసం ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తు సోమవారం నర్సాపూర్ అంబెద్కర్ చౌరస్తాలో పలు గ్రామాల రైతులు ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా లారీల కొరత వల్ల ధాన్యం బరువు తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.లారీలను వెంటనే కొనుగోలు కేంద్రాలకు రప్పించి ధాన్యంను తరిలించాలన్నారు. వరి పంటలను పండించిడమేనా మేము చేసిన పాపం అంటు లబోదిబో మంటున్నారు. రోజు రోడ్డెక్కుతు అలిసి పోతున్నా కష్టాల పాలవుతున్నా పట్టించుకునే నాధుడే లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు దాన్యం కొనుగోలు కోసం చేస్తున్న ధర్నాకు నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్, టిడిపి నర్సాపూర్ నియోజకవర్గ కన్వీనర్ హన్మంతు వెంకటరమణారావులు ఈ ధర్నాలో పాల్గొని రైతులకు మద్దతు పలికారు.విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శివకుమార్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని లారీలు వచ్చే విదంగా ఏర్పాటు చేస్తామని రైతులు అధైర్యపడ వద్దని నచ్చజెప్పడంతో రైతులు ధర్నా ను విరమించారు. ఈసందర్బంగా బిజెపి కన్వీనర్ వాల్దాస్‌మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేందాలను ప్రారంబించి రైతులు తెచ్చిన ధాన్యాన్ని కేంద్రాల వద్ద ఉంచి రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నారు. 40 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కు పట్టదా అని అన్నారు.లారీల కొరత, తరగు పేరిట రైతులను నష్టాల పాలు చేస్తున్న ప్రభుత్వానికి తగిన బుద్ది చెప్పాలన్నారు. ఇప్పటి కైనా రైతుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని లేని పక్షంలో బిజెపి పార్టీ అధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని వాల్దాస్ మల్లేష్‌గౌడ్ హెచ్చరించారు.

### దశాబ్ది ఉత్సవాలపై ఉన్న శ్రద్ధ.. ధాన్యం సేకరణ మీద లేదు : హాఫీజోద్దీన్

**మెదక్ మున్సిపాలిటీ, మే29 ప్రభాతవార్త:** నియంతృత్వ పోకడలతో పరిపాలన సాగిస్తున్న కేసీఆర్‌కు దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ఉన్న శ్రద్ధ కొనుగోలు చేయడంపై లేదని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫీజోద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రైతులు పండించిన పంటలు ఇంకా కల్లాల్లోనే ఉన్నాయన్నారు. 40 శాతం వడ్లు కల్లాల్లోనే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. మిల్లర్లు మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దించుకోకపోవడంతో రవాణా వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని ఆరోపించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఫిర్యాదుల సత్వరపరిష్కారంపై దృష్టి సారించాలి

## కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు అధికారులకు సూచన


ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో, మే 29, ప్రభాతవార్త:** ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారుల కు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమానికి 39 ఫిర్యాదులు అందాయి. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ శరత్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పలువురు ఆర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. వారు తమ సమస్యలను విన్నవిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదులను అందజేశారు. గ్రీవెన్స్ హాల్లో రెవెన్యూ డివిజనల్ అధికారి అంబదాస్ ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణికి మొత్తం 39 ఆర్జీలు రాగా, అందులో 12 రెవెన్యూశాఖకు సంబంధించినవని, 27 ఇతర శాఖలకు సంబంధించిన ఆర్జీలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించుకోవడానికి చక్కని వేదిక ప్రజావాణి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రజావాణి చాలా గొప్ప కార్యక్రమం అని సామాన్యులు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి చక్కటి వేదిక అని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో సమస్యలు పరిష్కరించుకోవడానికి వచ్చిన ప్రతి దరఖాస్తు దారునికి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో డీఅర్వో లక్ష్మీకిరణ్, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా ఖజానా శాఖ స్ట్రాంగ్ రూమ్ ప్రారంభం

జిల్లా కలెక్టరేట్‌లో నూతనంగా నిర్మించిన జిల్లా ఖజానాశాఖ స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ ప్రారంభించారు. స్ట్రాంగ్ రూమ్ గదిని అర్అండ్‌బి ఇంజనీరింగ్ అధికారులు అధునాతన పద్ధతిలో అత్యంత పకడ్బంధీగా నిర్మించారు. ఖజానాశాఖ విభాగంలో పైళ్లకు మంచి భద్రతతో స్ట్రాంగ్ రూమ్ నిర్మించిన ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ అభినందించారు.ఖజానాశాఖ ఇంచార్జి అధికారి జగదీష్ సింగ్, అర్అండ్‌బి అధికారి రాము తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

# పకడ్బంధీగా దశాబ్ది వేడుకలను నిర్వహిస్తాం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, సీపీ తదితరులు

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ వివరణ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమవారం హైదారాబాద్ నుంచి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్, సీపీ శ్వేతలతో పాటు వివిధశాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. జూన్ 2 నుంచి 21 వరకు నిర్వహించే రాష్ట్ర దశాబ్ది వేడుకలలో మన ప్రగతి చాటేలా ఘనంగా నిర్వహించాలని ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. రైతు దినోత్సవం, ఊరురా చెరవుల పండుగ నిర్వహణ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రణాళిక తయారు చేసుకోవాలని అదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే దశాబ్ది వేడుకలను జిల్లాలో అంగరంగవైభవంగా నిర్వహించడానికి పక్కా ప్రణాళికలను సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అర్థిక, అరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు జూన్ 2న అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అన్ని శాఖల ద్వారా సాధించిన ప్రగతి వివరించేలా పకడ్బంధీగా దశాబ్ది వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, జడ్పీ సీఈఓ రమేష్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్డీఓ చంద్రమోహన్, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌ఎడ, బిసి సంక్షేమ అధికారి మురళి, డిఎంఅండ్‌హెచ్‌ఓ కాశీనాథ్, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యానవన అధికారి సునిత, డిపిఓ దేవకిదేవి, డిపిఆర్ఓ రవికుమార్ పాల్గొన్నారు.

# సుడా మోడల్ లే అవుట్ వేలంపాటకు ప్రజల నుంచి కానరాని స్పందన


వేలం పాట నిర్వహిస్తున్న సుడా వైస్ చైర్మన్, అధికారులు

**సిద్దిపేట రూరల్, మే 29, ప్రభాతవార్త :**
సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో సిద్దిపేట డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లే అవుట్ వేలం పాటలను జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో సోమవారం నిర్వహించారు. అధికారులు నిర్వహించిన వేలం పాటలకు మొదటి రోజు ప్రజల నుంచి పెద్దగా స్పందన కానరాలేదు. ఉదయం 10 గంటలకు నిర్వహించాల్సిన ప్రత్యేక వేలం పాటకు ప్రజల నుంచి పెద్దగా స్పందన రాకపోవడంతో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించారు. 101 ప్లాట్లకు వేలం పాట నిర్వహించగా పట్టుమని 14 ప్లాట్లకు మాత్రమే ప్రజలు వేలం పాట పాడారు. 30 మంది వేలం పాటలో పాల్గొన 14 ప్లాట్లు మాత్రం అమ్ముడుపోయాయి. సుడా అధికారులు లే అవుట్‌లో ఒక్క ప్లాట్లుకు గజానికి ధర రూ.8 వేల నిర్వహించి ప్రత్యేక వేలం పాట నిర్వహించారు. ఈనెల 30న లే అవుట్ ప్లాట్ల వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందని సుడా వైస్ చైర్మన్ కె.వి.రమణాచారి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు. సుడా అధికారులు, సిబ్బంది నందనం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం బాబులకు అడ్డాగా పల్లె ప్రకృతి వనాలు

## పట్టించుకోని అధికారులు

**అల్లాదుర్గం, మే29 ప్రభాతవార్త:**
ప్రతి గ్రామ పంచాయితీలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఈ పల్లె ప్రకృతి వనాల్లో గ్రామాల్లోని కొందరు అక్రమార్కులు నిత్యం మద్యం మద్యం సేవించడానికి అడ్డాగా మార్చుకొని మద్యం సేవిస్తూ సీసాలను వదిలి వెళ్తున్నారు. అల్లాదుర్గం మండలం మందాపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఈ సంఘనట చోటుచేసుకుంది. కొంత మంది అక్రమార్కులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నా రు. నిత్యం మందుబాబులు మద్యం సేవించేందుకు ఈ పల్లె ప్రకృతి వనాన్ని తమకు అడ్డాగా మార్చుకున్నారు. అధికారులు మొక్కలను సంరక్షించాలని సమావేశాల్లో, గ్రామ సభల్లో మాట్లాడటం జరుగుతుందే తప్ప వాటి పనితీరు ఎలా ఉందో కనీసం పల్లె ప్రకృతి వనాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో మద్యం ప్రియులకు అడ్డగా మారుతున్నాయని ఆరోపణలు వినవపిస్తున్నాయి. ఈ పల్లె ప్రకృతి వనంలో మద్యం సీసాలు కనిపించడంతో ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మొక్కలకు నీరు కూడా అందకపోవడంతో మొక్కలు ఎండుమొఖం పడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలను పరిరక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో మందుబాబులు తమ స్థావరాలుగా ఏర్పాటు చేసుకుంటున్నట్లు గ్రామస్థులు విమర్శిస్తున్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను బాగా చూసుకుంటే గ్రామానికి ఎంతో ఉపయోగపడతాయని, అంతేకాకుండా ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని గ్రామస్థులు అంటున్నారు. అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో ఈ పల్లె ప్రకృతి వనాలు ఎండుమొఖం పడుతూ పనికి రాకుండా పోతున్నాయని, సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మాందాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు.


మాందాపూర్‌లో పల్లె ప్రకృతి వనం


మద్యం సేవించి వదిలేసిన సీసాలు

# దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తాం

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, మే29 ప్రభాతవార్త:** 21 రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించుటకు కార్యాచరణ రూపొందించుకొని అధికారులకు దిశానిర్ధేశం చేశామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలు పకడ్బందీగా నిర్వహించుటకు అధికారులతో పలు దఫాలు సమావేశాలు ఏర్పాటు చేసి దిశానిర్ధేశం చేశామని అన్నారు. ఆదివారం ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమక్షంలో కార్యాచరణ ఆమోదించుకొని గ్రామ, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయు కార్యక్రమాలపై అవగాహనకు వచ్చి సిబ్బందికి విధులు కేటాయిస్తూ ఆర్డర్స్ కూడా ఇస్తున్నామన్నారు. నియోజకవర్గ స్థాయిలో శాసన సభ్యుల ఆధ్వర్యంలో సమావేశాలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధానంగా క్లస్టర్ పరిధిలో, గ్రామాలలో చేపట్టే పెద్ద కార్యక్రమాలైన రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ ఘనంగా నిర్వహించుటకు అధికారులను సమాయత్తం చేశామన్నారు. నోడల్ అధికారులు తమ శాఖ ఇచ్చే ఆదేశాలతో పాటు కార్యక్రమ షెడ్యూల్ ప్రకారం 2014కు పూర్వం ఇప్పటి వరకు సాధించిన ప్రగతిపై నియోజకవర్గం వారీగా, గ్రామ, మండల వారీగా నాడు నేడు పరిస్థితులపై అద్దం పట్టే విధంగా రూపొందించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయుటకు ఆదేశించామన్నారు. ఆయా రోజుల్లో శాఖ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు కరపత్రాలు పంపిణీ చేస్తారని, లబ్ధిదారుల విజయగాధలు, అభిప్రాయాలను నలుగురికి తెలిపేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. చక్కటి ఫ్లవర్ డెకరేషన్‌తో పాటు మూడు రోజుల పాటు విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నామన్నారు. జిల్లాలోని కొన్ని ప్రధాన కార్యాలయాలతో పాటు ఏడుపాయల, ఖిల్లా, చర్చి ప్రదేశాలను 21 రోజుల పాటు విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో, జిల్లా ప్రవేశం, ముగింపు ప్రాంతాల్లో, జంక్షన్‌లలో ఆర్చీలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయనున్నామన్నారు. అదేవిధంగా కార్యక్రమాల నిర్వహణపై డాక్యుమెంటేషన్‌తో పాటు వీడియో చిత్రీకరణ చేయనున్నామని సీఎస్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమసింగ్, రమేష్, డీఎస్పీ సైదులు, జిల్లా అధికారులు యేసయ్య, చందు నాయక్, సాయిబా బా, ఆశాకుమారి, విజయశేఖర్‌రెడ్డి, జయరాజ్, బ్రహ్మాజీ, రవిప్రసాద్, విజయలక్ష్మి, రజిని, ఖాసీం, రాధాకిషన్, రాజిరెడ్డి, జెంలా నాయక్, సత్యనారాయణరెడ్డి, ఇందిరా, కరుణ, కమలాకర్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు

# బీరప్ప కామరతి కళ్యాణోత్సవం

**- పాతలింగయ్యపల్లిలో కొనసాగుతున్న కార్యక్రమం**

**- గంగమ్మకు బోనం.. ఘనంగా ఊరేగింపు**


ఊరేగింపుగా బోనం తీసుకెళ్తున్న భక్తులు

**పాపన్నపేట, మే 29, ప్రభాతవార్త:**
బీరప్ప స్వామి కామరతిల కళ్యాణోత్సవం మండల పరిధిలోని పాతలింగయ్యపల్లిలో సోమవారం కనుల పండుగగా జరిగింది. గొర్రెల కాపరుల సహకార సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఈ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. కళ్యాణ మహోత్సవానికి ముందు రోజు సంఘం ఆధ్వర్యంలో గంగమ్మకు బోనాలు సమర్పించారు. కుల పెద్దలైన లింగం, ఝాన్సీ దంపతుల ఇంటి నుండి గంగమ్మ బోనం భారీ డప్పు చప్పులతో పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ బోనాల ఊరేగింపు సమయంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం భక్తులు గంగమ్మ ఒడిలో ఉన్న లింగాలను వెతికే కార్యక్రమం నిర్వహించారు. దొరికిన లింగాలను బీరప్ప స్వామి ఆలయానికి తీసుకువెళ్లి ప్రతిష్టింజేశారు. సోమవారం నాడు గుడి చుట్టూ లింగాల ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శన భక్తులకు ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం వేద పండితుల మంత్రోత్చనాల మధ్య బీరప్ప, కామరతి కళ్యాణోత్సవం జరిపించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణోత్సవం తిలకించారు. స్వామివారి తీర్థప్రసాలు స్వీకరించారు. చికోడ్ సొసైటీ చైర్మన్ సిద్దంశెట్టి దత్తు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు జగన్నాథం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రాణి కిష్టయ్య, ఉపసర్పంచ్ అంజయ్య, నాయకులు తిరుపతిరెడ్డి, నవీన్, వెంకటేశం పాల్గొన్నారు.

### నేడు ఎల్లమ్మ తల్లికి బోనాలు

**పాపన్నపేట, మే 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పొడ్చన్‌పల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లికి బోనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు గౌడ సంఘం నిర్వాహకులు వెల్లడించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, సాయంత్రం అమ్మవారికి బోనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

# రాజీవ్ రహదారిపై రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులకు నచ్చజెబుతున్న ఎస్ఐ ప్రవీణ్‌రాజు

**బెజ్జంకి, మే 29, ప్రభాతవార్త :** దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించట్లేదనే నానుడికి నిదర్శనంగా తయారైంది రైతుల పరిస్థితి. రైతుల వ్యయ ప్రయాసాలకోర్చి తిండి, తిప్పలు మానుకొని కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాసి ధాన్యాన్ని అమ్ముకుంటే రైస్ మిల్లు యజమానులు కోతలు విధిస్తూపొట్టకొడుతున్నారని తోటపల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మినా దిగుమతి చేసుకోవడం లేదని సోమవారం తోటపల్లికి చెందిన రైతులు రాజీవ్ రహదారిపై ధాన్యం సంచులతో ఆందోళన చేపట్టారు. గ్రామంలో మూడు రైస్‌మిల్లులు ఉండగా ధాన్యం దిగుమతికి అధికారులు రెండు రైస్ మిల్లులను కేటాయించారని ధాన్యాన్ని మిల్లుకు తరలించిన అనంతరం తాలు, నూక శాతం, ఇతరత్రా కారణాలతో సుమారుగా 10 నుంచి 15 బస్తాల వరకు రైస్‌మిల్లు యజమానులు కోతలు విధిస్తున్నారని వాపోయారు. గ్రామంలోని ఏ ఒక్క రైతు నుంచి నేటివరకు ధాన్యం దిగుమతి చేసుకోలేదని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ధాన్యం దిగుమతి విషయంలో రైస్‌మిల్లు యజమానులతో తిప్పలు తప్పడం లేదని రైతులు అంటున్నారు. కోతల పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులను అందినకాడికి దోచుకుతింటున్నారు. రైస్‌మిల్లుల యజమానుల వేధింపుల పై సంబంధితశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం మాత్రం శూన్యమని రైతులు అంటున్నారు. రైస్ మిల్లు యజమానులతో అధికారులు కుమ్మక్కైయ్యారేమోనని సందేహం కలుగుతుందని రైతులు తెలిపారు.

రైతుల ఆందోళనతో రాజీవ్ రహదారిపై మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్థంబించింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రవీణ్ రాజు రైతుల వద్దకు చేరుకొని సమస్యను అధికా రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వ దంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు.


రీసైక్లింగ్ గురించి వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితవెంకన్న

## వాడని వస్తువులకు రీసైక్లింగ్ ....!

**హుస్నాబాద్ టౌన్, మే 29, ప్రభాతవార్త :** వాడి వదిలేసిన లేదా వినియోగించకుండా అలాగే వదిలేసిన వస్తువులను రీసైకిలింగ్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చూస్తామని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని 15వ వార్డులో ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని పరిశీలించారు. వినియోగంలో లేని పాత చెప్పులు, షూస్‌లు, పాతబట్టలు, ప్లాస్టిక్ వస్తువులు, పాతపుస్తకాలు, తదితర వస్తువులను సేకరించి వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమాలు జూన్ ఐదు వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ సాయిప్రణీత్, మాజీ ఎంపిపి ఆకుల వెంకట్, ఇంచార్జి ఎస్సై జాలిగం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజిఇనీర్ రవికుమార్, శ్రీకాంత్, సతీష్, జవాన్లు సారయ్య, ప్రభాకర్ వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## జీవన గమనంలో వ్యాయామం భాగం కావాలి

-సిద్దిపేట ఎస్బీ ఇన్‌స్పెక్టర్ లేతాకుల రఘుపతిరెడ్డి


మాట్లాడుతున్న రఘుపతిరెడ్డి

**హుస్నాబాద్, మే 29, ప్రభాతవార్త :** జీవన గమనంలో నిత్యం ఉరుకులు పరుగులు, వ్యాయామం భాగం కావాలని ప్రజలకు సిద్దిపేట ఎస్బీ ఇన్‌స్పెక్టర్ లేతాకుల రఘుపతిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని రాజరాజేశ్వర కళ్యాణ మంటపంలో మాజీ ఎంపిపి ఆకుల వెంకట్ అధ్యక్షతన రన్నింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించగా రఘుపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మనిషికి నిత్యం కసరత్తు తప్పనిసరని అలాగే శరీరానికి ఉరుకులు పరుగులతో పనిని పెట్టాలని సూచించారు. దీంతో ప్రతివారిలో ఏకాగ్రత, సత్ప్రవర్తన, ఆరోగ్యం ఇనుమిడిస్తాయన్నారు. అనంతరం రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఆకుల వెంకట్‌ను కార్యవర్గం ఎన్నుకుంది. అసోసియేషన్‌లో సభ్యత్వం పొందాలంటే రూ.2వేల చెల్లించాల్సి ఉంటుందని వారికి రన్నింగ్ అసోసియేషన్ పేరుతో టీషర్టును అందచేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అమ్మిగల్ల రమేష్, డాక్టర్ ధర్మానాయక్, చంతకింది శ్రీనివాస్, సివి రామన్ పాఠశాల కరస్పాండెంట్ కాయిత నారాయణరెడ్డి, రామక్రిష్ణ, లక్ష్మణ్‌నాయక్, నరేష్, అభిలాష్ పాల్గొన్నారు

## పంతులు తండాల్లో 'కంటివెలుగు' ప్రారంభం

**అక్కన్నపేట, మే 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పంతులు తండ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ భూక్య అశ్వినిహేము రాథోడ్ ఆధ్వర్యంలో ఎంపిపి మాలోతు లక్ష్మిభీలూనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మిభీలూనాయక్ మాట్లాడుతూ కంటివెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యురాలు భూక్య మంగశ్రీనివాస్, అక్కన్నపేట ఎంపిటిసి సభ్యులు బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, ఎంపిడివో సత్యపాల్‌రెడ్డి, వైద్యాధికారి వినీత, బిఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సత్యంనాయక్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## వెల్కటూర్ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం


నియామక ం పత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి ప్రవీణ్‌రెడ్డి

**సిద్దిపేట రూరల్, మే 29, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని వెల్కటూర్‌లో సోమవారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా రాచమల్ల గట్టయ్య, ఉపాధ్యక్షులుగా బొల్లు కనకయ్య, కార్యదర్శిగా బొల్లు రాజేష్, డైరెక్టర్లుగా వీరయ్య, యాదయ్య, నర్సింలు, ఎల్లయ్య, కనకయ్య, రాజయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు గట్టయ్య, కనకయ్యలు మాట్లాడుతూ గ్రామంలో మత్స్యకార్మికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. మత్స్యకార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి ప్రవీణ్‌రెడ్డి పాల్గొని నూతనంగా నియామకమైన వారికి నియామకం పత్రాలను అందించారు.

## వైభవంగా బీరప్ప కామరాజు కళ్యాణ మహోత్సవాలు


పెద్ద పట్నం వద్ద మొక్కులు తీసుకుంటున్న భక్తులు

**కోహెడ, మే 29, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తంగళ్లపల్లి గ్రామంలో 10రోజులుగా జరుగుతున్న బీరప్ప కామరాజు కళ్యాణం డప్పుచప్పుళ్ళ, భాజాభజంత్రీలు ఒగ్గు పూజారులచే అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కుర్మ కులస్తులు కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి పెద్దఎత్తున కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం పెద్ద పట్నం వేయగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గుడోలు కళాకారులు బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవ చరిత్రను కథ రూపంలో భక్తులకు వివరించారు. కళ్యాణ మహోత్సవం అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని పిల్లాపాపలు అరోగ్యాలతో వర్ధిల్లేలా రైతులు సంఖ:సంతోషాలతో విరాజిల్లాలని మొక్కులు మొక్కుకున్నారు. కార్యక్రమంలో కుర్మకులస్తులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మల్లన్న దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

**ములుగు, మే 29 (ప్రభాతవార్త):** ములుగు మండలం బండమైలారం గ్రామంలో మల్లన్న దేవాలయ నిర్మాణానికి సోమవారం డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కెసిఆర్ రెండోసారి ముఖ్యమంత్రి కావాలని ఆలయంలో ముడుపు కట్టగా ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి రూ.6 లక్షల విరాళం అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి విరాళం అందజేస్తున్న దృశ్యం

## పేదలకు వరం 'కంటివెలుగు' : ఎంపిపి పుష్పలత

**దుబ్బాక, మే 29, ప్రభాతవార్త:** కంటి వెలుగు పథకం కంటి సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన కంటి వెలుగు పథకం గొప్ప వరమని దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శిలాజినగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మదూరి శ్రీనివాస్ తో కలిసి ఆమె ప్రారంభిచారు. ఈ సందర్భంగా శిబిరంలో ఆమె కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఎంపీపీ కొత్త పుష్పలత మాట్లాడుతూ రాష్ట్రంలో కంటి వెలుగు పథకం ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు కోటిన్నరకు పైగా ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్య తెలంగాణగా రాష్ట్రంగా మార్చేందుకు సీఎం కేసీఆర్ తో కలిసి ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమకున్న కంటి సమస్యలను పొగొట్టుకునేందుకు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బానోత్ శంకర్ నాయక్, గ్రామ కార్యదర్శి శశికుమార్, బిఆర్ఎస్ నాయకులు మలోత్ భాస్కర్, శ్రీనివాస్, గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వివోఏలు అరెస్టు


పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన వివోఏలు

**దుబ్బాక, మే 29, ప్రభాతవార్త:** ఏంపాపం చేశామని అరెస్టులు చేస్తున్నారని వీఓఏ మండల అధ్యక్షుడు జింక లక్ష్మణ్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సెర్పు కార్యాలయ ముట్టడికి వెళ్తున్న తమను సోమవారం ఇండ్లవద్దే అక్రమంగా అరెస్టు చేశారని జింక లక్ష్మణ్, ఉపాధ్యక్షులు జమున, జాలిగామ బాబు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బాక అక్బర్‌పేట భూంపల్లి పోలీస్ స్టేషన్ లో పోలీసులు ముందస్తుగా ఐకెపి వివోఏ లను ముందస్తు అరెస్ట్ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు వేతనాలు పెంచడం లేదని ఆదేదన వ్యక్తం చేశారు. ఐకెపి వివోఏ లను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి కనీసం వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమాను కల్పించాలన్నారు. తమ న్యాయమైన పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. వివోఏలు సంధ్య, సుజాత, పద్మ, రాధిక, మమత, రేఖ, నవీన, బాలింగవ్వ, రుక్మిణి, హైమావతి, పలువురున్నారు.

## ఓటర్ లిస్టు వెరిఫికేషన్‌పై సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న తహసీల్దార్ రాజిరెడ్డి

**కోహెడ, మే 29, ప్రభాతవార్త :** సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజిరెడ్డి అన్ని రాజకీయ పార్టీలతో ఓటర్ లిస్టు వెరిఫికేషన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఓటర్‌లిస్టులో పేరు తప్పులు ఉన్నా పేరు గల్లంతైన సరిచేసుకునేందుకు తహశీల్దార్ అన్ని రాజకీయ పార్టీ నాయకులతో అవగాహన సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సురేందర్, హరీష్ కుమార్, విద్యులత, కొండపాక బాలక్రిష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఖమ్మం వెంకటేశం, దూలం శ్రీనివాస్, పిడిశెట్టి రాజు, జాలిగం శంకర్, అవుల చిన్న మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**శివ్వంపేట, మే 29 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన శేరిపల్లి శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్త అతన్ని పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. తనను ఆదుకోవడం పట్ల శ్రీనివాస్ మహేష్‌గుప్తకు ధన్యవాదాలు తెలిపాడు. కార్యక్రమంలో సర్పంచి పత్రాల శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచి ఆర్. పద్మా వెంకటేష్, వార్డు సభ్యులు వంజరి కొండల్, పోచాగౌడ్, పంబాల సంతోష్, జ్యోతి సింహం, కె. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


నియామక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

## రఘునందన్‌రావుని ఇంటికి పంపడమే లక్ష్యం

**దుబ్బాక, మే 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాళ్ళపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ, విద్యార్థి, యువజన, సోషల్ మీడియ విభాగాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తాళ్లపల్లి గ్రామ యువత అధ్యక్షుడిగా అవునూరి నరేష్, సోషల్ మీడియ అధ్యక్షుడిగా కాసులబాద్ నాగరాజు, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా గోపరి అశోక్, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జ్ పావని సురేష్‌గౌడ్, దుబ్బాక మండల పార్టీ మాజీ అధ్యక్షుడు టేకులపల్లి మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడోల్ల దేవరాజ్ మాట్లాడుతూ యువత విద్యార్థులు కార్యకర్తలు, గ్రామంలోకి వెళితే అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. బిజెపి నాయకులు చేస్తున్న అసత్యవు, అబద్దపు ప్రచారాలు ఎండగడుతూ బిజెపి నాయకులను గ్రామంలో అడ్డుకునేందుకు నిలదీస్తామని హెచ్చరిస్తూ బహిరంగంగా వివరించడం జరిగింది. ఈసారి సార్వత్రిక ఎన్నికలలో రఘునందన్ రావుని ఇంటికి పంపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్‌లు దమ్మగౌని ప్రశాంత్‌గౌడ్, ఎర్రోల్ల రాజు, పార్టీ అధ్యక్షుడు చౌదర్‌పల్లి శ్రీనివాస్, టెలికాం బోర్డ్ మెంబర్ పాతూరి శ్రీనివాస్ గౌడ్, కూడవెళ్ళి పాలక మండల సభ్యుడు పాతూరి తిరుపతి గౌడ్, సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ యాదగౌడ్, రైతు సమన్వయ కమిటీ మెంబర్ వేల్పుల నర్సింలు, వార్డు సభ్యులు జైపాల్ రెడ్డి, పాతూరి దుబ్బగౌడ్, గోపరి నర్సింలు, గోపరి బాలయ్య, బొమ్మరపు ఎల్లం, పాతూరి బాను, పెద్దోల్ల స్వామి, గోదా రాజు, గోదా తిరుపతి, వేల్పుల శేకర్, వేల్పుల సతీష్, వేల్పుల అంజనేయులు, గోషికె రాజు, గోపరి బాలు, గోపరి కిష్టయ్య, గోపరి కనుకరాజు, గోదా స్వామి, గోదా దేవయ్య, గోషికే రవి, పాతూరి సాయికిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు

**సిద్దిపేట రూరల్, మే 29, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, రాములు, కనకయ్య అన్నారు. టిపిటిఎఫ్ పదో అవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని టిపిటిఎఫ్ భవన్‌లో జిల్లా శాఖ అధ్యక్షులు సిహెచ్ విజేందర్‌రెడ్డి చేతుల మీదుగా జెండా అవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టిపిటిఎఫ్ నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారంతోపాటు అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుందన్నారు. 8 ఏళ్లుగా పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎంఈవో, డిప్యూటీ డిఈవో, అధ్యాపక ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అంధ్రాలో జరిగిన ఒప్పందం ప్రకారం తెలంగాణలో పరిష్కారం చూపాలన్నారు. మూడు డిఎలను తక్షణమే విడుదల చేయాలన్నారు. జూలైలో వేతన సవరణ గడువు ముగిస్తుండడంతో వెంటనే పీఆర్‌సి కమిటీ వేయాలన్నారు. మన ఊరు మన బడి పథకాన్ని అన్ని పాఠశాలలకు మంజూరు చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి ఎఫ్‌ఎల్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల, విద్య రంగ సమస్యలు పరిష్కరించడంలో ఏమాత్రం నిర్లక్ష్యంచేసిన టిపిటిఎఫ్ అధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు జమీర్ మోహియోద్దీన్ పద్మయ్య, జానికిరాములు, విష్ణువర్ధన్, సత్యనారాయణ, జనార్ధన్‌రెడ్డి, తిరుపతి, మల్లేశం, మహమూద్, సత్యకృష్ణ, శివాజీ, విష్ణు, లింగారెడ్డి, నరేష్, హరికృష్ణ, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, పద్మారెడ్డి, భగవాన్, తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.


టిపిటిఎఫ్ జెండాను అవిష్కరిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న అర్చక ఉద్యోగులు

## బ్రాహ్మణ పరిషత్ భవన ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేద్దాం

**సిద్దిపేట రూరల్, మే 29, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లిలో ఈనెల 31న రూ.12 కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ పరిషత్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా ఆలయ అర్చక, ఉద్యోగస్తులు, బ్రాహ్మణ బంధువులు అధిక సంఖ్యలో హాజరు కావాలని అర్చక ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు కలకుంట్ల కృష్ణమాచార్యులు, కలకుంట్ల వెంకట నరసింహాచార్యులు, చంద్రకుమార్ పిలుపునిచ్చారు. బ్రాహ్మణ పరిషత్ భవనాన్ని సిఎం కెసిఆర్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంతో పాటు దేశంలో మొదటిసారిగా ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ. వంద కోట్లు కేటాయించేలా సిఎం కెసిఆర్ బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేశారని వారు పేర్కొన్నారు. కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు విద్య, వ్యాపార రుణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా అర్చక ఉద్యోగులకు వేతనాలు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి గ్రామంలో అర్చకులకు దూప దీప నైవేద్యం ద్వారా నెలకు రూ.6 వేలు చెల్లిస్తు న్నారని వివరించారు. బ్రాహ్మణ పరిషత్ భవన ప్రారంభోత్సవ కార్య క్రమానికి అర్చక ఉద్యోగులు, బ్రాహ్మణ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సి.హెచ్.వెంకట నరసింహ చార్యులు, రాజుపంతులు, మహేష్‌పంతులు, శ్రీకాంత్‌రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

## సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు పండుగలు

ఎమ్మెల్యే వోడితల సతీష్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**కోహెడ, మే 29, ప్రభాతవార్త :** సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు పండుగలని హుస్నాబాద్ ఎమ్మెల్యే వోడితల సతీష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని తంగళ్లపల్లి గ్రామంలో శ్రీ బీరప్ప-కామరతి కల్యాణ మహోత్సవం(పెద్ద పండుగ)లో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. పండుగలు మానవ సంబంధాలను బలోపేతం చేస్తాయని బంధువులు, సహచరులతో పండుగ జరుపుకోవడం అనేది ప్రతిఒక్కరూ అనందించే విషయమన్నారు. గొల్లకుర్మల అరాధ్య దైవమైన శ్రీ బీరప్ప-కామరతి కల్యాణ మహోత్సవం అనాదిగా భక్తిశ్రద్దలతో జరుపుకొని గ్రామంలోని ప్రజలందరూ బాగుండాలని అలాగే పాడి పంటలతో గ్రామం సమృద్ధిగా ఉండాలని గొల్లకుర్మలు జరుపుకునే పెద్ద పండుగ ఎంతో విశేషమైందన్నారు. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత తెలంగాణ పల్లెలన్నీ అభివృద్ధికి చిరునామాలుగా మారి అచారాలు సాంప్రదాయాలు, పాటించుకుంటూ ఉన్నతంగా తీర్చిదిద్దుకొని సిఎం కెసిఆర్ కలలకు అనుగుణంగా అడుగులు వేస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో గొల్లకుర్మలు ప్రతి ఇంట్లో బంధువులతో కలిసి అనందోత్సవాలతో శ్రీ బీరప్ప-కామరతి కళ్యాణ మహోత్సవం జరుపుకున్నారు.

## వివోఏల అక్రమ అరెస్టులు ఆపాలి

-సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య


మాట్లాడుతున్న సందబోయిన ఎల్లయ్య

**గజ్వేల్, మే 29 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి వివోఏలకు ధర్నాకు అనుమతి ఇచ్చి రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా మహిళలని చూడకుండా తెల్లవారుజాము 5 గంటల నుంచే అక్రమ అరెస్టులు చేసి నిర్బంధం ప్రయోగించిందని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని విమర్శించారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో గత 26 రోజుల నుండి వివోఏలు ధర్నాచేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ అనుమతితో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కువద్ద చేపట్టిన ధర్నాకు గజ్వేల్ నియోజకవర్గం నుండి వివోఏలు వెళ్తున్నారనే సమాచారంతో ముందస్తు అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో వెంకటాచారి, రాములు, రాజుతో గౌరారం, జగదేవ్‌పూర్, బేగంపేట, రాయపోల్, కుకునూర్‌పల్లి పోలీస్‌స్టేషన్లకు పలువురు మహిళలను తరలించారు. అక్రమ అరెస్టులు చేసినా భయపడేది లేదని వివోఏల సమస్యలు పరిష్కరించేంత వరకు మా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

31న సిఎం కెసిఆర్ చేతులమీదుగా

## బ్రాహ్మణ భవనం ప్రారంభోత్సవం

-బ్రాహ్మణ సేవావాహిని జిల్లా అధ్యక్షుడు శేషం శ్రీనివాసచార్యులు

**గజ్వేల్, మే 29 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా ఈనెల 31వ తేదీన రంగారెడ్డి జిల్లా గోపానపల్లిలో బ్రాహ్మణ భవనం ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరుగనుందని బ్రాహ్మణ సేవావాహిని సంఘం జిల్లా అధ్యక్షుడు శేషం శ్రీనివాసచార్యులు పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సిఎం కెసిఆర్ చేతులమీదుగా ఈనెల 31న రంగారెడ్డి జిల్లా గోపాన్‌పల్లిలో రూ.12 కోట్ల నిధులతో నిర్మించిన బ్రాహ్మణ భవన ప్రారంభోత్సవం ప్రారంబోత్సవం చేయడం హర్షణీయమన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బ్రాహ్మణుల సంక్షేమం కోసం మొదటిసారిగా బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేయడం, బ్రాహ్మణులందరికీ విద్య, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు రావడం బ్రాహ్మణ పరిషత్ ద్వారా కృషిచేయడం జరుగుతుందన్నారు. బ్రాహ్మణపరిషత్ ద్వారా వివేకానంద ఓవర్ స్కీమ్స్, బ్రాహ్మణ విద్యార్థులకు విదేశాల్లో చదవడం కోసం 780 మంది విద్యార్థులకు 76.67 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. బ్రాహ్మణులలో వ్యాపారానికి ప్రోత్సహించడం కోసం బెస్ట్ స్కీం కింద 5074 మంది పేద బ్రాహ్మణ కుటుంబాలకు 150 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం సబ్సిడీ రూపంలో అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రఘుకిరణాచార్యులు ఆదేశాల మేరకు గజ్వేల్, సిద్దిపేట నుండి అధిక సంఖ్యలో బ్రాహ్మణులు తరలిరావాలన్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు కూడా బ్రాహ్మణ భవనం నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ రమణచారి కృషి ఎంతగానో ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 31న జరిగే కార్యక్రమానికి బ్రాహ్మణ బంధువులందరూ వేలాది సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న శేషం శ్రీనివాసచార్యులు

# గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సమావేశంలో రసాభాస

## టేబుల్ ఎజెండాను తిరస్కరించిన కౌన్సిల్ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్, మే 29 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ల మధ్య రోజురోజుకు వివాదం తారాస్థాయికి చేరుకుంటుంది. నాలుగు సంవత్సరాల నుండి మున్సిపల్ అభివృద్ధిపై పాలకవర్గం దృష్టి పెట్టకుండా పాలన కొనసాగిస్తున్నారు. ఆరు నెలల క్రితం మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళిపై పాలక వర్గ సభ్యులు అవిశ్వాత తీర్మానం ప్రవేశపెట్టారు. దాంతో మున్సిపల్ చైర్మన్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకువచ్చారు. అవిశ్వాసం తీసుకు వచ్చిన కౌన్సిలర్లు చైర్మన్‌తో పట్టింపు లేకుండా ఎవరి వార్డులో వారు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన సాధారణ సభ్యసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో కొన్ని ఎజెండాలో పొందుపర్చిన అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలపగా చివరగా టేబుల్ ఎజెండాలో అంశాలను కౌన్సిల్ సభ్యులు పరిశీలించి తిరస్కరించగా సమావేశం రసాభసగా మారింది. తమకు తెలియకుండా ఎజెండాను ప్రవేశపెట్టారని కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం సమావేశం యదావిధిగా సాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు బబ్బూరి రజితగౌడ్, ఉప్పల మెట్టయ్య, తలకొక్కుల భాగ్యలక్ష్మిదుర్గాప్రసాద్, పంబాల అర్చనశివకుమార్, మర్కంటి వరలక్ష్మికనకయ్య, బొగ్గుల చందు, రహీం, అత్తెల్లి శ్రీను, గంగిశెట్టి చందన, అల్వాల బాలేష్, లక్ష్మికిషన్‌రెడ్డి, శీర్ల శ్యామల మల్లేశం, కూరాకుల శ్రీనివాస్, షహనాజ్ సమీర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దలోడిలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**మునిపల్లి, మే 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దలోడి గ్రామంలో సోమవారం సర్పంచ్ మమత అశోక్, ఎపిటిసి చిట్కూల రేణుక వెంకటేశంలు ఎంపిపి గౌడిగామ శైలజ శివకుమార్, జడ్పీసిటీ పైతర మీనాక్షి సాయికుమార్‌తో కలిసి సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సహకారంతో రూ.20లక్షలు సిసిరోడ్డు పనులకు నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్, సీనియర్ నాయకులు శివకుమార్, అల్లం నావాజ్‌రెడ్డి, మాజీ ఎంపిపి చెంద్రన్న, మండల బిఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, నాయకులు రాజు, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మొగులయ్యతో పాటు నాయకులు పాల్గొన్నారు.

## రైతు బంధుకు దరఖాస్తు చేసుకోండి : ఏవో

**మునిపల్లి, మే 29, ప్రభాతవార్త :** పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేస్తున్న రైతు బంధు పథకంలో భాగంగా కొత్తగా పట్టాపాస్ బుక్ వచ్చిన రైతులందరు రైతుబంధు పథకానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని సోమవారం మునిపల్లి మండల వ్యవసాయ అధికారి శివకుమార్, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైతుబందు రానివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాస్‌బుక్ ఆధార్ కార్డు బ్యాంక్ అకౌంట్ వివరాలను ఏఈవోకు అందజేయాలన్నారు.

## ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న టాస్క్ ఫోర్స్ బృంధం సభ్యుల దృశ్యం

**కంగ్టి, మే 29, ప్రభాతవార్త:** నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులు వక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ బృంధం ఏడిఏ అంబిక హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రమైన కంగ్టిలో ఎరువుల, మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని రిజిష్టార్లను పరిశీలించి దుకాణం నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు అందచేశారు.సబ్ ఇన్స్‌పెక్టర్ రాములు, ఏఈఓ సంధ్య తదితరులు ఉన్నారు.

## ఆరూర్ ఆలయంలో నేడు నవగ్రహ పూజలు



ఆరూర్ ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తుల దృశ్యం

**సదాశివపేట, మే 29, ప్రభాతవార్త:** మండలంలోని ఆరూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ కాలభైరవ స్వామి, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఆలయ బలిపీఠం, గరుడాల్వార్ శివలింగ యంత్ర విగ్రహ ప్రతిష్ట, పూర్వక మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమంలో సోమవారం ఘనంగా కొనసాగాయి. ఆలయం నుంచి స్వామి వారి ఊరేగింపు కనుల విందుగా నిర్వహించారు. ఈ నెల 30వ తారీఖున నవగ్రహాల పూజ, హోమం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఉత్సవ కమిటి నిర్వాహకులు పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామ మాలా ధారణ చేసిన 10 మంది స్వాములు పూజా కార్యక్రమంలో పాల్గొననున్న ట్లు వివరించారు. స్వాముల కమిటీ ఉపాధ్యక్షులు శివకు మార్, రవికుమార్, మన్నె విఠల్, మాజీ సర్పంచ్ బస్వరాజ్, ప్రవీణ్‌గౌడ్, కృష్ణగౌడ్, పాండు రంగరాజు, సంగేమేశ్వర్, జైపాల్, నర్సింలు పాల్గొన్నారు.

## నేడు ఎఐఎంఐఎం పార్టీ బహిరంగ సభ



ఎఐఎంఐఎం బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకుల దృశ్యం

**సదాశివపేట, మే 29, ప్రభాతవార్త:** ఈ నెల 30వ తారీఖున పట్టణంలో ఎఐఎంఐఎం పార్టీ బహిరంగ సభను సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎఐయంఐయం పార్టీ అధ్యక్షులు గౌస్ పాష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ ఆశ్వర్యంలో కొనసాగే బహిరంగ సభలో సామాజిక పరిస్థితులు–అవగాహన అంశంపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఎఐఎంఐఎం జాతీయ అధ్యక్షులు అసదోద్దీన్ ఓవైసి, శాసన సభ్యులు అక్బర్ ఓవైసి కౌసర్ మహియుద్దీన్, పార్టీ కార్పోరేటర్లు హాజరవుతున్నట్లు వివరించారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని గౌస్‌పాషా వినతి చేశారు.

## భవానిమాత సేవాలాల్‌ను దర్శించుకున్న సాయినాథ్



ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న చింత సాయినాథ్ దృశ్యం

**సదాశివపేట, మే 29, ప్రభాతవార్త:** మండలంలోని మద్దికుంట తండాలో సోమవారం కొనసాగిన పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు బిఆర్ఎస్ రాష్ట్ర యువ నేత చింత సాయినాథ్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమలు నిర్వహించారు తండాలోని శ్రీ భవాని మాత సేవాలాలనమహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు వేద మంత్రాల మధ్య భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింత సాయినాథ్ మాట్లాడుతూ మద్దికుంట గ్రామ, తండా వాసులు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో ధ్వజ స్థంబం ఏర్పాటు, హోమాలు, పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయానికి చేరుకున్న చింత సాయినాథ్‌ను ఆలయ కమిటి బాధ్యులు, సదాశివపేట సొసైటీ వైస్ చైర్మన్ పాండు నాయక్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆలయ ఆవరణలో బోరు వేసేందుకు గ్రామ మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అరిఫోద్దిన్ ఆలయ కమిటి బాధ్యుల వినతి మేరకు హామి చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అరిఫోద్దిన్, మండల మాజీ కో–ఆప్షన్ సభ్యులు సలావోద్దిన్, పట్టణ పార్టీ యువత అధ్యక్షులు బిట్ల ప్రేమ్‌కుమార్, రమేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, ఎస్ విఠల్, ఎస్ బన్యానాయక్, ఎస్ రవి, సంగ్రామ్ నాయక్, పాండు, మేఘూ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన సేవలను అందుబాటులో ఉంచడమే లక్ష్యం

నాణ్యమైన డయాగ్నోస్టిక్స్ సేవలను సరసమైన ధరలలో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచడమే లుపిన్ డయాగ్నోస్టిక్స్ లక్ష్యమని సీఈవో రవికుమార్ పేర్కొన్నారు. బందరురోడ్డులోని గేట్‌వేలో జరిగిన విలేకరుల సమావేశంలో అంతర్జాతీయంగా ఫార్మా అగ్రగామి లుపిన్ లిమిటెడ్ శాటిలైట్ ల్యాబోరేటరీని ప్రారంభించినట్లు సీఈవో రవికుమార్ వెల్లడించారు.



ధనసిరిలో నకిలీ సోయాబీన్ విత్తనాలు పరిశీలిస్తున్న అధికారుల దృశ్యం

## ఇంటిపై దాడి.. నకిలీ విత్తనాలు స్వాధీనం

**జహీరాబాద్ (మొగుడంపల్లి), మే 29, ప్రభాతవార్త:** నమ్మదగిన సమాచారం మేరకు వ్యవసాయ అధికారులు, చిరాగ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా ఓ ఇంటిపై దాడి చేసి అమ్మకానికి సిద్దంగా ఉంచిన సోయాబీన్ విత్తనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన సంఘటన సోమవారం నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్, మండల వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ కథనం ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు ధనసిరి గ్రామంలోని ఒగ్గి సిద్దన్న ఇంటిని సోదా చేయగా రహస్యంగా దాచి ఉంచిన మీరా మోతి కంపెనీకి చెందిన 200 సోయాబీన్ విత్తనాల బస్తాలు లభ్యమయ్యాయన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో విత్తనాలను దాచుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేస్తే రశీదును విధిగా తీసుకోవాలని, విత్తనాల బస్తాపై ఎక్స్‌పయిరీ తేదీని పరిశీలించాలని, సరైన లేబుల్, లాట్ నంబర్‌లను పరిశీలించి కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. పక్క రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి నకిలీ విత్తనాలు రాకుండా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిఘా ఏర్పాటు చేశామన్నారు.

## జహీరాబాద్ నుంచి రోడ్డెక్కిన 3 డీలక్ బస్సులు

### బస్సు డ్రైవర్‌గా మారిన ఎమ్మెల్యే మాణిక్‌రావు



డీలక్స్ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు దృశ్యం

**జహీరాబాద్, మే 29, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణం నుంచి హైద్రాబాద్‌కు ఇక నుంచి డీలక్ బస్సులో రయ్‌రయ్ మంటూ హాయాగా ప్రయాణం చేసే అవకాశం ప్రయాణీకులకు తెలంగాణ ఆర్టీసి అధికారులు కల్పించారు. జహీరాబాద్ నుంచి హైద్రాబాద్‌కు, కర్ణాటకలోనీ బీదర్ పట్టణానికి వెళ్లే ప్రయాణీకుల కొరకు 3 డీలక్స్ బస్సులను సోమవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రారంభించి తానే బస్సు డ్రైవర్‌గా మారి డీలక్స్ బస్సును తోలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ ఆర్టీసి వారు కల్పించిన డీలక్స్ బస్సు సౌకర్యాలను ప్రయాణీకులు సద్వినియోగం చేసుకుని త్వరితగా, కులాసాగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఇజ్రాయిల్ బాబి, శివప్ప, లవాన్, ఉపేందర్, డిపో మేనేజర్ రజినీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## సిసి కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు దృశ్యం

**న్యాల్‌కల్, మే 29, ప్రభాతవార్త:** మండలంలోని ముంగి చౌరస్తాలో మండలంలోని హద్నూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నేత షకీల్ ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను సోమవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గడం తథ్యమన్నారు. కెమెరాలను ఏర్పాటుకు చొరవ తీసుకున్న షకీల్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సిఐ నోముల వెంకటేశం, ఎస్ఐ వినయ్‌కుమార్, బిఆర్ఎస్ మండల కార్యదర్శి మాతంశెట్టి రాజ్‌కుమార్, మండల మైనార్టీ అధ్యక్షులు హనీఫ్, మిర్జాపూర్(బి) గ్రామ కమిటి అధ్యక్షులు ఇమ్రాన్, మాజీ సర్పంచ్‌లు రాజు పాటిల్, శ్రీనివాస్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్, నాయకులు బోడ భాస్కర్, నిరంజన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మజీద్ పటేల్, షఫీయోద్దిన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈఎస్ఐ అభివృద్ధి కమిటి సభ్యుడిగా కృష్ణకాంత్



ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యుడిని సన్మానిస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, మే 29, ప్రభాతవార్త:** రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులుగా తొంట కృష్ణకాంత్‌ను సోమవారం నియమించారు. కమిటి సభ్యులుగా నియమితులైన తొంట కృష్ణకాంత్‌ను స్థానిక నేతలు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా తొంట కృష్ణకాంత్ మాట్లాడుతూ మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిల సహకారంతోనే తనకు పదవి అందిందని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. పదవికి న్యాయం చేసేలా ఆసుపత్రిలోని సమస్యలను ఎంపి, ఎమ్మెల్యేల సహకారంతోఉ పరిష్కారం అయ్యేలా పనులు కొనసాగిస్తానని హామి చేశారు.

## విద్యారంగ, సామాజిక సమస్యలపై టిపిటిఎఫ్ పోరాటం

**సంగారెడ్డి బ్యూరో, మే 29, ప్రభాతవార్త:** విద్యారంగ, సామాజిక సమస్యల ఎజెండాతోనే తెలంగాణ ప్రోగ్రెసిస్ టీచర్స్ ఫెడరేషన్ పోరాడుతుందని, అందరికీ విద్య అందరికీ వైద్యం ఇవి పేదలకు అందిన నాడు సమాజంలో నిజమైన ప్రగతి సాధిస్తుందని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ అన్నారు. టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్ ముందు పిటిపిఎఫ్ జెండాను ఎగురవేసి ఆయన మాట్లాడారు. అలుపెరుగని ఉద్యమాలు టిపిటిఎఫ్ నిర్వహిస్తూ, విద్యాభివృద్ధికి బాధ్యతలకై నిలబడి హక్కులకై కలబడు అనే నినాదం కోసం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సంజీవయ్య, ఖంరోద్దీన్, సీనియర్ నాయకులు భూమి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి ఉపాధ్యాయ ఖాళీలు లేని పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్, మర్రి ప్రశాంతి, జిల్లా కార్యదర్శులు అశోక్‌కుమార్, మల్లికార్జున్, ఆడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం, సభ్యులు సంతోష్‌కుమార్, సోషల్ మీడియా కమిటీ సభ్యులు పుండరీకం, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ హేమలత, అకాడమిక్ సెల్ కన్వీనర్ సాయిలుచారి, రిటైర్డ్ నాయకులు బుచ్చయ్య, భోజరాజ్ అశోక్‌కుమార్, మునిపల్లి మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, హత్నూర మండల అధ్యక్షులు బనోత్ రవీందర్, కంది మండల ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్, పటాన్‌చెరువు మండల ప్రధాన కార్యదర్శి సుభాష్‌రావు, పుల్కల్ మండల అధ్యక్షులు జయకృష్ణ, గోవర్దన్, దుర్గయ్య, జయరాములు, గీతామాలిని, ఆనందం, సామెల్ తదితరులు పాల్గొన్నారు.



టిపిటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

# దశాబ్ది ఉత్సవాలను పండగలా జరుపుకోవాలి

**గ్రామ గ్రామాన జెండాలను ఆవిష్కరించాలి : ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి**

**నర్సాపూర్, మే 29.ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 21 రోజుల పాటు జరిగే దశాబ్ది ఉత్సవాలను జూన్ నెల 2 నుండి జూన్ 22 వరకు తెలంగాణా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని, అదేవిదంగా ఈఉత్సవాల్లో ప్రతి ఒక్కరు బాగస్వాములై ఒక పండగలా జరుపుకోవాలని ఈ ఉత్సవాల సందర్భంగా ప్రతి గ్రామ గ్రామాన జెండావిష్కరణ లు చేయాలని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి లు వెల్లడించారు. సోమవారం నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాల అడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రాష్ట్ర మహిళా కమీషన్‌చైర్ పర్సన్ సునీతారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌లు హాజరయ్యారు, ఈసందర్భంగా ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి లు మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులు, చేసిన కార్యక్రమాలను గుర్తు చేసుకుంటు ఈ ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. ఈ ఉత్సవాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు జడ్‌పిటీసిలు, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు బాగస్వాములై పాల్గోనాలని అన్నారు. ఈ దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా 21 రోజుల పాటు ప్రతి రోజు ఏదో ఒక కార్యక్రమాన్ని జరుపుకోవాలన్నారు.ఈ మేరకు దశాబ్ది ఉత్సవాలను జెండాల ఆవిష్కరణలతో ప్రారంభించి, రైతు వేదికల్లో రైతు దినోత్సవం, సురక్షదినోత్సవం, విద్యుత్ దినోత్సవం, పారిశ్రామిక దినోత్సవం, సాగునీటి దినోత్సవం, చెరువుల కట్టల పైన ఉత్సవాల సంబరాలు, తెలంగాణ సంక్షేమ, సుపరిపాలనా, మహిళా దినోత్సవం, వైద్య ఆరోగ్య దినోత్సవం,పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలను జరుపుకోవడం, కొత్త గ్రామ పంచాయతీల్లో సంబరాలు జరుపుకోవడం, విధ్య దినోత్సవం, మన ఊరు మనబడి కార్యక్రమాలు,ఆలయాలలో ప్రత్యేక పూజలు, అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని వారు సూచించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీతారెడ్డి తదితరులు

గ్రామ గ్రామాన జెండాలను ఆవిష్కరించి , రైతు వేదికలను, మున్సిపాలిటీ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని అన్నారు.ఈ ఉత్సవాలను చెరువు కట్టలపై ఒక పండగలా జరుపుకోవాలన్నారు. అంతేగాక ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో మంది హాజరయ్యి ఈ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. అదనపు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూఆ యా శాఖల అధికారులకు శాఖ ల వారిగా అన్నిరంగాల్లోఅభివృద్ది పనులను గుర్తించి పనుల తీరు పై అధికారులకు అవార్డులివ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వేల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మన్సూర్,ఆత్మ కమిటీ చైర్మన్ గొరె వెంకటరెడ్డి, మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్, ఆయా మండలాల జడ్‌పిటీసీలు, ఎంపిటిసీలు, సర్పంచ్ లు ,ప్రజా ప్రతినిధులు, వివిద శాఖ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వేతన ఒప్పంద పత్రాలు అందజేస్తుకుంటున్న యాజమాన్యం, కార్మిక నేతలు

## పార్లే ఆగ్రోలో మెరుగైన వేతన ఒప్పందం

### - సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య

**పటాన్‌చెరువు మే 29, ప్రభాతవార్త:** కార్మికుల ఐక్యతతోనే పార్లే ఆగ్రో పరిశ్రమలో మెరుగైన వేతనం ఒప్పందం జరిగిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, కార్మిక సంఘం అధ్యక్షులు కే.రాజయ్య తెలిపారు. మండలంలోని పాశమైలారంలోని పార్లే ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం డిసీఎల్ రవీందర్‌రెడ్డి సమక్షంలో వేతన ఒప్పందం పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ కార్మికుల ఐక్యతతో మంచి వేతన ఒప్పందం సాధించామన్నారు. రాష్ట్రంలో బెవరేజ్ పరిశ్రమలలో మెరుగైన వేతన ఒప్పందంగా అభివర్ణించారు. పరిశ్రమలో సిఐటియు ద్వారా రెండవ ఒప్పందం చేయడం జరిగిందన్నారు. ప్యాకేజీ రూ.8600లు ఇతర అలవెన్సులు కలిపి రూ.9798 డైరెక్టుగా వచ్చాయని తెలిపారు. సిటిసిగా చూస్తే రూ.13 వేలు అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. సిఐటియు రాకముందుకు ఈ పరిశ్రమలో కార్మికులకు చాలా తక్కువ వేతనాలు ఉన్నాయని గుర్తు చేశారు. సిఐటియు వచ్చిన ఈ నాలుగేళ్లలో రెండు అగ్రిమెంట్ల ద్వారా రూ.19 వేలు పెరిగాయన్నారు. సిఐటియు అంటేనే మెరుగైన వేతన ఒప్పందాలన్నారు. ఇంక వీడిఏ రూ.8.80లు అన్నారు. కార్మికుల ఐక్యత ద్వారానే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. అగ్రిమెంటు మూడు సంవత్సరాల కాలమన్నారు. అగ్రిమెంట్‌కు సహకరించిన యజమాన్యానికి, కార్మికులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రంలో పరిశ్రమ జీఎం మల్లికార్జున్‌రెడ్డి, హెచ్ఆర్ కరీం, యూనియన్ ఆఫీస్ బేరర్స్ సంతోష్‌కుమార్, రాజశేఖర్, జంగయ్య, కిరణ్, సుధాకర్, సుజిత్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, మే 29, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరువు డివిజన్ పరిధిలోని హజ్రత్ సయ్యద్ మురాద్ అలీషా దర్గా, హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షా దర్గా, చోటా మసీద్ ప్రాంగణాల్లో రూ.4 లక్షల 50 వేలు సొంత నిధులతో 40 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక నాయకులు, మైనార్టీ మత పెద్దలతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, వీటి ద్వారా అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయడంతో పాటు నేరాలను నియంత్రించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరువు సిఐ వేణుగోపాల్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ లాలూ నాయక్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, ముస్లిం మత పెద్దలు లియాకత్‌అలీ, వాజిద్‌అలీ, అజ్మత్, ఇక్బాల్, మోయిన్, అతీక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఈఐఆర్ ఫోర్టల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి : టూ టౌన్ సీఐ

**సిద్దిపేట రూరల్, మే 29, ప్రభాతవార్త :** పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్ స్వాధీనం చేసుకొని సోమవారం టూ టౌన్ సీఐ రవికుమార్ తిరిగి బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని మందపల్లి గ్రామానికి చెందిన కనకయ్య 15 రోజుల క్రితం ఫోన్ పోగొట్టుకున్నాడని తెలిపారు. వెంటనే పోలీసు స్టేషన్‌కు రాగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకవచ్చిన వెబ్‌సైట్‌లో ఫోన్ యొక్క ఐఎంఈఐ నంబరును ఎంటర్ చేసి బ్లాక్ చేయడం జరిగిందన్నారు. ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో ఈ వెబ్‌సైట్ ద్వారా అతని వివరాలతో సమాచారం రాగానే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేసినట్లు తెలిపారు. ఎవరన్న ఫోన్ పోగొట్టుకున్న, గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకవచ్చిన సీఈఐఆర్‌లో పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చునని దీంతో పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ పోర్టల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరన్నా సెకండ్ హ్యాండ్ ఫోన్‌ను అమ్మితే కొనుగోలు చేయొద్దన్నారు.



పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితుడికి అప్పగిస్తున్న టూ టౌన్ సీఐ రవికుమార్



నాగల్‌గిద్దలో సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దృశ్యం

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, మే 29, ప్రభాతవార్తం** మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో 20లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను సోమవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డ నిర్మాణం పనులను నాణ్యతతో పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచిస్తూ పనులు పూర్తయ్యే వరకు అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటి డైరెక్టర్ నాగ్‌శెట్టి పాటిల్, సర్పంచ్ శివాజీ , బిఆర్ఎస్ నాయకులు సునీల్ పాటిల్, శ్రీకాంత్, బాలాజీ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని దామర్‌గిద్దలో ఇటీవల మృతి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త విఠల్ రావు పాటిల్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు.

## పాఠశాలలో నిధి ఆప్కే నిఖత్



నిధి ఆప్కే నిఖత్ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగుల దృశ్యం

**రామచంద్రాపురం, మే 29, ప్రభాతవార్త:** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రతి మాసం నిర్వహించే నిధి ఆప్కే నిఖత్ 2.0 కార్యక్రమాన్ని బిహెచ్ఈఎల్ విద్యుత్‌నగర్‌లోని మార్గదర్శిని పాఠశాలలో నిర్వహించారు. రిజినల్ పి.యఫ్ కమీషనర్ విశాల్ అగర్వాల్ ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమంలో ఇ.పి.యఫ్ చందారులు, ఫిం చనుదారుల సమస్యల పరిష్కారానికి కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. చిన్నపాటి సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తూ ఉద్యోగులకు ఊరట కల్గిస్తున్నారు. భవిష్యనిధి సంస్థ తన చందాదారులకు చేరువయ్యేందుకు చేస్తున్న సత్వర పింఛను మంజరు కార్యక్రమం ప్రయాస్ పథకంలో భాగంగా మే నెలలో వివిధ పరిశ్రమలు సంస్థలతో పని చేసి పదవీ విరమణ పొందిన 25 మంది పించనుదారులకు పించన్ మంజరు చేసినట్లు అందులో 13 మంది పించను దారులను సోమవారం విద్యుత్ నగర్ బిహెచ్ఈఎల్ శిబిరంలో పించను పత్రాలను బిహెచ్ఈఎల్ లేబర్ కాంట్రాక్టు సొసైటీ ఉద్యోగులు, ఆగర్వాల్ రబ్బరు, పెన్నార్ పరిశ్రమలకు చెందిన వారికి అందచేశారు. పదవీ విరమణ పొందిన మాసంలోనే పించను పత్రాలను అందించడంతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పియఫ్ కమీషనర్ ఆర్ శ్రీదేవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జివి రావు, అకౌంట్ అధికారి డి బబుల్ నాథ్ నాయక్, కార్యలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇక్రిశాట్ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఇక్రిశాట్ కాంట్రాక్ట్ కార్మికుల దృశ్యం

**రామచంద్రాపుం, మే 29, ప్రభాతవార్త:** రామచంద్రాపురం పట్టణంలోని ఇక్రిశాట్ కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం ఆందోళన పూనుకున్నారు. కర్మాగారం 2వ గేట్ వద్ద కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ శ్రమకు తగిన వేతనాలు అందించడం లేదని విచారం వ్యక్తం చేశారు. చట్టపరంగా రావాల్సిన కనీస సౌకర్యాలు కల్పించాలని వినతి చేసిన వారిని కాంట్రాక్ట్ కార్మికులను కాంట్రాక్టర్లు విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల నుంచి తొలగించిన వారిని భేషరుతగా విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని కాంట్రాక్ట్ కార్మికులు హెచ్చరించారు.